క్లుప్తంగా

బీజేపీలోకి వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు

మాడ్గుల: మాడ్గుల మండలం ఆవురుపల్లి గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు బీజేపీలో చేరారు. వైఎస్‌ఆర్‌టీపీ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గణేశ్‌యాదవ్, నర్సింహ, లింగం, గణేశ్, కృష్ణ, శ్రీనుచారి, వెంకటయ్య, వీరయ్య, వెంకటేశ్, రాఘవచారితో పాటు పలువురు కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సీఐ రామాంజనేయులు

యాచారం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించి ఎన్నికలు జరిగే విధంగా సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. శనివారం మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంకి శ్రీను ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పట్టణ పెయింటర్ సంఘం అధ్యక్షుడు సత్యం, నాయకులు సురేశ్, మహేశ్, వెంకటేశ్, శ్రీశైలంకుడీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

యాచారం: నందివనపర్తి అనుబంధ గ్రామమైన పిల్లిపల్లి గ్రామంలో శనివారం బీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో హన్‌మాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ట్రస్ట్ అధినేత శేఖర్‌రెడ్డి, అర్చన, స్థానిక సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, రవీందర్‌రెడ్డి దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ అనంతరం ఆలయంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కొంగళ్ల జోగిరెడ్డి, యాచారం పీఏసీఎస్ డైరెక్టర్ కంబాలపల్లి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆచారిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారిని గెలిపించాలని జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి సాయిలాల్ నాయక్ ప్రజలను కోరారు. శనివారం మండల పరిధిలోని పిల్లిగుండు, కొండ్రిగానిబోడ్, పెద్దారెడ్డిచెరువు, నాగిరెడ్డిగూడ తండాల్లో ఆచారిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలాల్ నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, రాందాస్‌నాయక్, పత్యా, రాజు, రమేశ్, రాకేశ్, కల్యాణ్, శ్రీకాంత్‌నాయక్ ఉన్నారు.

సేవే 'లయన్స్' లక్ష్యం

లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జూలురి రమేశ్

ఆమనగల్లు: ప్రజాసేవ లయన్స్‌క్లబ్ లక్ష్యమని క్లబ్ జిల్లా చైర్మన్ జూలురి రమేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జూలురి శంకరయ్య స్మారకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి.. అవసరమైన మందులను అందిస్తున్నామని తెలిపారు. లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, యాదయ్య, రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా కార్యవర్గసభ్యుడిగా మహేశ్

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన బండి మహేశ్‌ను నియమిస్తూ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, కాళిదాసు శనివారం మహేశ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేస్తానని మహేశ్ తెలిపారు.

గెలిపించండి సేవ చేస్తా

- కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురేద్దాం
- కేసీఆర్‌ది నియంత పాలన
- జైపాల్‌యాదవ్ విఫల నేత
- కసిరెడ్డి నారాయణరెడ్డి



ర్యాలీలో అభివాదం చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ పల్లెచెలక, బోయిన్‌గుట్ట, చరికొండ, ముద్విన్ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

జైపాల్‌యాదవ్ విఫలం

బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, మాటలు తప్ప చేసింది ఏమి లేదని విమర్శించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని తెలిపారు. సాగునీటి సమస్యను కూడ తీర్చలేదని, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంలో, విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచాక నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిగా పనిచేస్తానని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

మండల కేంద్రంతో పాటు, వాస్‌దేవ్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో, వంపూగూడ, వాస్‌దేవ్‌పూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు మధు, హన్మానాయక్, యాదగిరిరెడ్డి , వేణుగోపాల్, ఇక్బాల్ పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం

- కసిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి
- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పదు
- నారాయణరెడ్డి సతీమణి మాధవి



ప్రచారం నిర్వహిస్తున్న మాధవి, భగ్‌వాన్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున వారి సతీమణులు ప్రచార రంగంలోకి దిగారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి పతులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కల్వకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి శనివారం మండల పరిధిలోని మాదాయిపల్లిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణరెడ్డిని మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తారని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత కనిపిస్తోందని పేర్కొన్నారు. అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చెప్పారు. మాయ మాటలు చెప్పి మరోసారి అధికారంలోకి రావాలని భావిస్తున్న బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీలు అంబాజీ, రఘునాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, శ్రీను, యాదయ్య, ఇస్తారి, సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డి విజయానికి కృషి

ఆమనగల్లు: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తాండలో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాగ్యానాయక్, గోపాల్, హర్యానాయక్, శంకర్, రవి, మల్లేశ్, వెంకట్రాం, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఒకే నామినేషన్



ఆర్వోకు నామినేషన్ల పత్రాలను అందజేస్తున్న బాలచందర్

ఇబ్రహీంపట్నం: శాసనసభ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మొదలైంది. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు రెండో రోజు (శనివారం) ఒకే ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా మంచాల మండలం చీదేడ్ గ్రామానికి చెందిన తోడే బాలచందర్ నామినేషన్ దాఖలు చేశారు. మొదటిరోజు పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ నుంచి ఉంద్యాల సదానందారెడ్డి నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు రెండు నామినేషన్ల ఈ సెగ్మెంట్ నుంచి దాఖలయ్యాయి.

ఆదివారం సెలవు

ఆదివారం సెలవు రోజు కావడంతో నామినేషన్ల స్వీకరించమని అనంతరెడ్డి తెలిపారు. సోమవారం యథావిధిగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట, పసుమాముల, తొర్రూర్, ఆటోనగర్, బంజార కాలనీల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై శనివారం తమ సిబ్బందితో కలిసి దాడి చేసి రూ.8,900 విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. రైస్ మిల్లులు, శీతల గిడ్డంగులు, ఫంక్షన్‌హాల్స్, కన్వెన్షన్ హాళ్లలో అక్రమంగా మద్యాన్ని నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. శుభకార్యాల్లో మద్యం పెట్టాలనుకునే వ్యక్తులు ఎక్సైజ్ అధికారుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం: ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రకటనతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ప్రచారాలు పోటాపోటీగా కొనసాగుతున్నాయి. బీజేపీ మాత్రం ప్రచార పర్వంలో వెనుకబడి ఉంది. అందరికంటే ముందుగా బీఆర్‌ఎస్ తమ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నోముల దయానంద్‌గౌడ్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించి రెండు వారాలు కావస్తున్నా ప్రచారంలో మాత్రం ఆ పార్టీ నాయకులు వెనుకబడి ఉన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ.. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.



ప్రచారంలో రంగంలో కాంగ్రెస్ శ్రేణులు

మల్‌రెడ్డికి మద్దతుగా పూజలు



ఆలయం ఎదుట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ ఇచ్చిన పిలుపుతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అన్ని గ్రామాలతో పాటు, పెద్దఅంబర్‌పేటలోని అన్ని వార్డుల్లో ఆయన అనుచరులు, అభిమానులు శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయాల్లో పెట్టి అనంతరం ఇంటింటికీ తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం చేపట్టారు.

యాచారం మండలంలో..

యాచారం: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఉదయం పలు గ్రామాల్లోని ఆలయాల్లోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తక్కళ్లపల్లి తండాలోని బంగారు మైసమ్మ ఆలయంలో మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతినాయక్ ఆధ్వర్యంలో.. నానక్‌నగర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ ముత్యాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో.. గునుగల్, మాల్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాల్ సర్పంచ్ పడకంటి కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను దేవతామూర్తుల పాదాల వద్ద ఉంచారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

దివ్యాంగులకు అండగా బీఆర్‌ఎస్

- నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: దివ్యాంగులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే, కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ఎఎన్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ కొత్త మల్లికార్జున్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వీరిని మోసం చేయడానికి అనేక హామీలు ఇస్తోందని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల నెట్‌వర్క్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, బంజారా దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, జిల్లా అధ్యక్షుడు వాలీనాయక్, స్థానిక దివ్యాంగుల సంఘం నాయకుడు శ్రీశైలం, చెన్నకేశవులు, మల్లేశ్, వెంకటయ్య, సురేశ్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

సీఐ కాశీవిశ్వనాథ్

మంచాల: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ కాశీ విశ్వనాథ్ సూచించారు. శనివారం మంచాల మండల పరిధిలోని జాపాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మహిళలను, పెద్దలను గౌరవించాలన్నారు. కష్టపడి చదువుకొని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి నాయక్, ప్రధానోపాధ్యాయుడు భీమ్లా నాయక్, ఉపాధ్యాయులు జయానంద్, చందన పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఐ, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు

అభ్యర్థుల వ్యయాన్ని పరిశీలించాలి



మాట్లాడుతున్న ప్రియరంజన్ శ్రీవాత్సవ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి చెక్ పోస్టులను, నామినేషన్లు స్వీకరించే ఆర్డీవో కార్యాలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రియరంజన్ శ్రీవాత్సవ శనివారం పరిశీలించారు. అనుమతిలేని వాహనాలను ఎలా గుర్తించాలి.. అభ్యర్థి ప్రచార ఖర్చుల అంచనా తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

వస్తున్నాయ్.. ప్రచార రథాలు



సిద్ధమైన కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల ప్రచార పర్వంలో ప్రచారం ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ఇందులో ప్రచార రథాలదే కీలక పాత్ర. అందువల్ల అన్ని పార్టీలు ప్రచార రథాలపై మొగ్గుచూపుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలు ఎన్నికల బరిలోకి దిగాయి. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపే లక్ష్యంగా ఉరూరా ప్రచారం చేసేందుకు రథాలను సిద్ధం చేశారు. ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల వివరాలను, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రధాన నాయకుల చిత్రాలతో ముద్రించిన ఫెక్సీలను వాహనాల చుట్టూ కట్టారు. పోలింగ్ తేదీని సూచిస్తూ.. హస్తం గుర్తుకు మన ఓటు... మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపిద్దాం అంటూ రాశారు. శనివారం వాహనాలకు పూజలు చేసి ప్రచార బరిలోకి దించేందుకు రెడీ చేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచార రథాలు రంగంలోకి దిగాయి.

జోరు పెంచిన కాంగ్రెస్



ప్రచారం నిర్వహిస్తున్న పద్మారెడ్డి, తదితరులు

మంచాల: పల్లెల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలను చుట్టేస్తున్నారు. శనివారం కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ.. హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

దర్గాలో ప్రార్థనలు

రాచకొండ గుట్టల్లోని గాలీబ్ సాహెబ్ దర్గాలో మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు సలాం నాయకత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు గాలబ్‌బాయ్, ఇమ్రాన్, రఫీక్, బురాన్, మాజీ సర్పంచ్ పాండరినాథ్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మాడ్గుల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ప్రచారంలో ఎంపీపీ పద్మారెడ్డి,కల్వకుర్తి తాలుక అభివృద్ధి సాధన కమిటీ చైర్మన్ యాచారం వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, లాలు నాయక్, హనుమంతు ,రాజు సురేశ్, శివ పాల్గొన్నారు.

మళ్లీ గులాబీ గూటికి ఆడాల గణేశ్



రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన గణేశ్ తదితరులు



శనివారం బీఆర్‌ఎస్‌లో చేరిన గణేశ్ తదితరులు

యాచారం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆడాల గణేశ్ శనివారం మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో ప్రాధాన్యత ఇవ్వడం లేదని రంగారెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. తన గెలుపు కోసం కృషి చేస్తే తగిన గుర్తింపు ఇస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతుంది. శనివారం రాగన్నగూడ మాజీ సర్పంచ్ కందాల లక్ష్మారెడ్డి, చెవుల వంశీధర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తలారి రవి, కిరణ్, శ్రీకాంత్, మంద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు

- మంచిరెడ్డి, జెపాల్‌యాదవ్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం
- పల్లెలు, పట్టణాలను చుట్టేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ప్రచారం చేస్తున్న రాంరెడ్డి

యాచారం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని నాలుగోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శనివారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నల్లవెల్లి గ్రామంలో జిల్లా రాములు, యాదయ్యగౌడ్, లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటిస్తూ.. కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీతండాలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. యాచారం, నక్కర్తమేడిపల్లి, గునుగల్ తదితర గ్రామాల్లో కూడ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రచారం ముమ్మరం

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని, శనివారం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ మెనిఫెస్టోలోని అంశాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఉప సర్పంచ్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డికి మద్దతుగా ప్రచారం



మంచిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న రేణుక

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మద్దతుగా శనివారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డులో పట్టణ బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు చెరుకూరి రేణుక ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి మంచిరెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా, కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి జగన్, మహేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.